# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి



సంపుటి 35 సంచిక 3
పేజీలు 40
నవంబర్ 2015

**5సం॥ల చందా రూ. 250**

**2సం॥ల చందా రూ. 120**

**సంవత్సర చందా రూ. 60**

**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు A/C Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో ............................ ....... పేజీ**


భద్రవాక్యం ........................................2

శ్రీబాబూజీ ఉవాచ........................................3

అమ్మమాట........................................................5

చలం - శ్రీశ్రీ ........................................7

పసి(డి) మనస్సు ........................................8

బంగారు క్షణాలు ........................................10

సన్నిధిలో సంభాషణ ........................................12

యోగవాశిష్ఠము ........................................14

శ్రీకృష్ణుడెక్కడ ఉన్నాడు? ........................16

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు........................18

ప్రవచనము ........................................19

పరిప్రశ్నేన సేవయా ........................................21

ఆ చల్లని అమృత హస్తం అందించిన వరదానాలెన్నో ........................................ 22

గీతాధ్యయనమ్........................................23

శ్రీకృష్ణకర్ణామృతము........................................25

కర్మయోగము ........................................27

అమృతబిన్దూపనిషత్ ........................................29

మహాభారత నీతి చంద్రిక........................31

అమెరికా పర్యటనలో శ్రీమాతాజీ బోధ........33

సత్సంగామృతం........................................35

సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర...........37

విష్ణు కథలు- భక్త కబీర్‌దాస్.................39

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

అన్ధం తమః ప్రవిశన్తి యేఽ విద్యాముపాసతే ।
తతో భూయ యివతే తమః య ఉ విద్యాయాగ్ం రతాః ॥
(ఈశావాశ్యోపనిషత్ 9శ్లో॥)

మానవుల ప్రవర్తన వారి ప్రవృత్తిని అనుసరించి వుంటుందన్నది లోక విదితమైన విషయమే. యద్భావం తద్భవతి అన్నది అందరికీ తెలిసినదే. ఉపనిషత్ అన్ధం తమః "ప్రవిశన్తి" అని వుద్ఘాటిస్తోంది. కాబట్టి విషయా సక్తులై జ్ఞాన మార్గాన్ని విస్మరించి అవిద్యలోనున్న మానవులంతా లోకంలో అవిద్యనే ఆశ్రయించి చీకటి జీవితాన్ని గడుపుతున్నారు. అటువంటివారికి జ్ఞాన కిరణం అందదు. జ్ఞానకిరణం వారిపై ప్రసరించినా దానిని అందుకునే స్థితిలో వుండరు.

అజ్ఞానం అనేది యెన్నడూ ఎవరినీ చేరదు. అది మానవులు ప్రయత్న పూర్వక ప్రవర్తన చేతనే సంక్రమిస్తోంది. అజ్ఞానం యెన్నడూ కర్మఫలం కాదు. జ్ఞానం లోపించటమే అజ్ఞానానికి హేతువు.

వెలుగు లేక కాంతి యెక్కడ లోపిస్తుందో అక్కడ చీకటి ఆవరిస్తుంది. వచ్చిన మానవజన్మను సార్థకం చేసుకుని తన బాధ్యతను గుర్తెరిగిన సాధకుడు జ్ఞానమార్గంలోనే వుంటాడు.

విషయాదులయందు విముఖత లేక వ్యతిరేక భావము పెంపొందించుకున్నప్పుడే అజ్ఞానమనే చీకటి నుండి బయల్పడే సదవకాశము వున్నదని తెలియజేస్తోంది.

సంసార విషయాలను జయించినవారి మనస్సు బ్రహ్మరూపమైన సమత్వాన్ని పొంది యీ జీవితంలోనే సంసారాన్ని జయిస్తారు.

# శ్రీ బాబూజీ ఉవాచ - పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులకు బోధ చేస్తూ "మానవజీవితం చాలా దుఃఖపూరితమైనది. మానవుడు ప్రేమించవల్సినది నిరాకార, నిరంజనమైన పరమాత్మ వస్తువు. పరమాత్మ నిర్వికల్పము, నిరంజనము, నిరాకారము. పరమాత్మ మనలాగా ఉన్నాడని అనుకోవడము అవివేకము. అది ఇక్కడ ఉంది, అక్కడ లేదు అనుకోవడం పొరపాటు, సర్వత్ర ఉన్నట్లైతే ఎక్కడైనా ఉండాలి కదా! అంటే తనలో కూడా ఉండాలి కదా! తనలో పరమాత్మను దర్శించగల్గితే తాను పరమాత్మ అయి ప్రకాశిస్తాడు. మహాజ్ఞాని తానే సర్వత్రా నిండి ఉన్నానని తెలుసుకుంటాడు. జ్ఞానము గ్రంధాలలో దొరుకుతుందా? పోనీ ఉపన్యాసాలలో గానీ, వ్యాఖ్యానాలలో గాని లభిస్తుందా?



జ్ఞానము గురించి ఉపన్యాసాలతో ప్రేక్షకులని ఆనందంతో ఓలలాడింపవచ్చు. అయితే అనుభవము బ్రహ్మానందంలో ఓలలాడింపచేస్తుంది. సృష్ఠిలో పదార్ధములను చూసినపుడు బాగానే ఉంటుంది. ఆ పదార్ధాన్ని తింటేనేగా కడుపునిండేది.

ఒక మహాగ్రంథము ఉంది. ఆ గ్రంథములోని శ్లోకాలలో అద్భుతమైన భావం ఇమిడి ఉంటుంది. అది మనకి మోక్షాన్ని ప్రసాదిస్తుందా?శ్లోకాలు చదివినంత మాత్రం చేత ఆత్మదర్శనం పొందామనుకుంటే ఎలా ఉంటుంది? పదార్ధాన్ని భుజించిన తరువాత తృప్తిగా ఉంటుంది. హాయిగా నిదుర పడుతుంది. అయితే బ్రహ్మపదార్థం తీసుకున్న వారికి నిదుర వస్తుందా? ఈ వ్యత్యాసాన్ని గమనించండి. గాఢ సుషుప్తిలో పొందే ఆనందానికి బ్రహ్మపదార్ధము తీసుకొని మెలుకువలో సమాధి స్థితిలో పొందే ఆనందానికి తేడా ఉండదా? గాఢ సుషిప్తిలో మనస్సు అణిగి ఉంటుంది. కాని గుణములు రహితం కాలేదు. ఆ ఆనందము తమోగుణ సహితమైన ఆనందము. కాని మెలుకువలో సమాధి స్థితిలో పొందిన ఆనందము గుణరహితమైనది. అది నిజ జాగ్రత్తస్థితి.

గృహస్థాశ్రమంలో ఉన్న మానవుడు ఇటువంటి ఆనందాన్ని ఎందుకు పొందలేడు. మానవజన్మ ఎత్తినందుకు తప్పక సాధించ గలుగుతాడు. మానవుడు మేధస్సు, యశస్సు, ఐశ్వర్యము కావాలని కోరనవసరము లేదు. దయామయుడైన పరమాత్ముడు అన్నింటిని అందజేయగలుగుతాడు. ఐదు మాసములు గల పిల్లవాడి తల్లికి ఏ సమయానికి ఏ సంరక్షణ అవసరమో, ఏది కావాలో తెలియదా? కర్మపుత్రులపైన ఈ జగత్తులో తల్లిదండ్రులకే ఇంతప్రేమ ఉంటే జగన్మాత, జగత్పితలకు జీవకోటిపైన ప్రేమ ఉండదా! జీవులు ఎన్ని పొరపాట్లు చేసినా, విషయాదుల్లో మునిగి పోయినా, భగవానుడు వీరిని ఉద్ధరించడానికి భక్తుల ద్వారా వారికి కావలసిన బోధను అందజేసి సక్రమమైన మార్గంలో నడిపిస్తున్నారు. తల్లిదండ్రులు తాము ఎంతగానో ప్రేమించే కర్మపుత్రులు దుఃఖసాంగత్యము ద్వారా చెడిపోతే వానిని సక్రమమైన మార్గంలోకి తీసుకురాటానికి స్నేహితులద్వారా, బంధువుల ద్వారా ప్రయత్నము చేస్తారు కదా! అలాగే భక్తులను ఉద్ధరించటానికి దయామయుడైన పరమాత్ముడు ఊరుకుంటాడా? ఇక్కడ మీకొక ఉదంతము చెబుతాను. ఒక ఇంట్లో దంపతులకి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. తండ్రికి పెద్ద కుమారుడు పెద్ద కుమార్తె అంటే గాఢమైన ప్రేమ.

తల్లికి చిన్న కుమారుడు, చిన్న కుమార్తె అంటే అమితమైన వాత్సల్యము. భార్యభర్తలిద్దరు ఒకరికి తెలియకుండా ఒకరు కొడుకులతో కూతుళ్ళతో రహస్య సంభాషణచేస్తారు. మరి అది నిజమైన ప్రేమ అనిపించుకుంటుందా? నిజమైన ప్రేమ అయినట్లయితే ఒకరిమధ్య ఒకరికి అరమరికలు ఎందుకు ఉండాలి? సూర్య భగవానుడు భాగ్యవంతునికి, పేదవానికి, మానవునికి జంతువులకు, చెట్లకు కాంతిని అందించడంలో వివక్షత చూపుతున్నాడా? పోనీ మురికి నీటికి, మంచినీటికి, కాంతిని ఇవ్వడంలో తేడా వుందా? అలాగే భగవానుడు సకల జీవకోటికి అందించే ప్రేమ సమానంగా ఉంటుంది. హెచ్చుతగ్గులు లేవు. కులగోత్రాలు లేవు. కాబట్టి మానవుడు ఆత్మదర్శనం పొందాలంటే వీటిని దూరం చేసుకోవాలి.

(తరువాయి భాగం కోసం 9వ పేజీ చూడండి)

(గత సంచిక తరువాయి) # అమ్మ మాట - జపమాల ప్రసాద

## ‘సత్సంగమనే ట్రెయిన్‌లో ఉన్నాం’

“శ్రీగురుదేవులు మనకి చిన్నప్పటి నుంచి సత్సంగమనే ట్రెయినింగ్ (శిక్షణ) అలవాటు చేశారు. మనం ఒక చోటు నుండి మరొక చోటుకు వెళ్ళాలంటే యేదో వక వాహనం యెక్కి వెళతాం; ఎడ్లబండో, సైకిలో, రిక్షానో, స్కూటరో, కారో ఏరోప్లేనో .... కానీ ఈ కాలమనే ప్రవాహాన్ని దాటడానికి మనందరము ‘సత్సంగం’ అనే ట్రెయిన్ (రైలుబండి) యెక్కివున్నాం. ఇది కూడా శ్రీగురుదేవులు ప్రసాదించినదే. ఎన్ని రోజలు సత్సంగాలు అని ప్రశ్నిస్తారు. ఆ ప్రశ్నకి బదులే లేదు. కొంతమంది ‘అమ్మ బాబోయ్ నాలుగురోజులే!’ అంటారు; మరికొంతమంది ‘అయ్యో! నాలుగు రోజులేనా?’ అంటారు.

సత్సంగమనే దానికి కాలంతో నిమిత్తం లేదు. ఇప్పుడు చేసుకో వచ్చా? అప్పుడు చేసుకోవాలా అనేది లేదు. ఇంతమంది ఉండాలన్నది లేదు. ఎప్పుడైనా, యెక్కడైనా, యెంతమంది వున్నా లేకపోయినా చేసుకో వచ్చు. ఎంతసేపైనా చేసుకోవచ్చు, ఎప్పుడూ నలుగురు ఉండాలంటే కుదరక పోవచ్చు. మనం ఒక్కళ్ళే ఉన్నా సత్సంగం చేసుకోవచ్చు. ఎందుకంటె ‘సత్’ వస్తువు మనలోనే వుంది. ‘సంగం’ అంటే కలయిక. మనం సర్వకాల సర్వావస్థలయందూ దానితో కలిసే వున్నాము. దానికి భిన్నమైననాడు మనని యిక్కడ వుండనీయరు. రుద్రభూమికి తీసుకు వెడతారు. నిరంతరం సద్వస్తువుతో కలిసి వున్నామని విచారణ చేయడమే సత్సంగం. ఒక సద్గ్రంథం పఠించటం సత్సంగం.

సమయం అవకాశం దొరికితే, యీ విధంగా సత్సంగాలు యేర్పాటు చేసుకోవచ్చు. ఇంతకీ, భగవంతుడు యేర్పరచిన యీ సత్సంగం అనే బండిలో ప్రయాణం చేస్తున్న మనకి యీ 7 రోజులు అయిపోయాక ఇది వదిలి పెట్టబడేదా? కానే కాదు. ‘నేను కామవరపుకోట జీడిని, వదలించుకుందామన్నా, మిమ్మన్ని వదిలేవాడిని కాదు’ అని శ్రీగురు దేవులు శెలవిచ్చివున్నారు. శ్రీగురుదేవులనే సద్వస్తువు మనల్ని విడిచిపెడితే ‘తద్దివిట దివిటే! ఏడుకట్ల సవారీయే!’

‘కష్టాలే కలుగనీ, నష్టాలే మిగలనీ, ఇష్టంగా ఎదురొడ్డి దాటుకుని నిష్ఠను వీడక సాగిపో’ అన్న వాక్యం గుర్తుంచుకుని, నిష్ఠని విడవకుండా, గమ్యాన్ని చేరుకోవాలి. ప్రపంచంలో నిజమైన అవగాహన కలిగి వుంటే

మనని ఏదీ బంధించలేదు. మహాత్ములందరూ మనలాగే ఒక శరీరాన్ని ధరించి, యీ లోకంలోకి వచ్చారు. వారు కూడా శరీర ధారణ చేసినందుకు, అందరితో కలసిమెలసి మసిలారు. చివరికి ఆ శరీరాన్ని యిక్కడే వదిలివేసి అంతర్హితులయ్యారు. వారు యీ ప్రపంచంలోనే జీవించినా, దేనిచేతా, ఏ ఒక్క విషయము చేతా వారు బంధింపబడలేదు. తనను తాను త్యాగం చేసుకున్నవాడే మహాత్ముడంటే. వారి ముద్ర మన మనస్సు మీద పడ్డాక మనని దాని నుండి యెవరూ విడదీయలేరు.

ఈ దేహమనే బండిని మనకి యెవరిచ్చారు? అది గుర్తించండి. ఈ శరీరం అందరిచేతా పూజింపబడాలి అని చూసేవారికి రాళ్ళు కూడా తప్పవు. ఈ శరీరం శిథిలం కాకమునుపే చేరవలసిన గమ్యం చేరుకోవాలి. 'యంత్ర శకటము శిథిలము కాకముందే నీ గమ్యస్థానం చేరుకో' అని మహాత్ములైన శ్రీ నిండ్రకోలను డాక్టరుగారు యిచ్చిన మహావాక్యం. ఈ యింటిని సద్వినియోగం చేసుకోవాలి. నిద్రని దగ్గరకు రానివ్వకండి. నిష్ఠ నిలిపితే నిద్రరాదు. మితాహారం, మితనిద్ర, మితభాషణ, సాధకునికి అత్యంత ఆవశ్యకమైన సాధనాలు.

మన గురుదేవులు చాలా ఫ్లెక్సిబుల్. కాని మనం చేయవలసిన సాధన మనం చేయకుండా వుంటే, లోపలి బాధలు మనని లోపలి నుంచే దొలిచి వేస్తాయి. 'నిద్ర' అనేది ఒక మాయ. సమయం అన్నిటికంటె అమూల్యమైనది. అది వెళ్ళిపోతుంది. అది ఎవరికోసమూ ఆగదు. ధ్యానం, ప్రార్థన సమయానికి చేసుకోవాలి. మనం టైమ్ ప్రకారం తింటున్నాం. ఒకవేళ సమాయనికి భోజనం దొరకకపోతే టిఫెన్ తింటాం. కాని భోజనం మటుకు దొరికినప్పుడు రెండు పూట్లకి సరిపడా తింటున్నాం. మరి ధ్యాన విషయంలో అలా యెందుకు చేయటం లేదు? ఎవరికి వారే అవగాహన కలిగి వుండాలి. సమయాన్ని వృథా చేయరాదు. శ్రీగురుదేవుల పుణ్యారాధనలని సక్రమంగా వినియోగించుకోండి. శక్తి వంచన లేకుండా అన్ని సేవల్లో పాల్గొనండి. త్వరపడి దీపం కొండెక్కే లోగానే యిల్లుని చక్కదిద్దుకోవాలి. శ్రీగురుదేవుల పుణ్య ఆరాధనలను సంపూర్ణంగా అనుభవిద్దాం. గురుపాదుకలు సర్వదా కాపాడుగాక! సుఖీభవ! సుఖీభవ!!

# చలం - శ్రీశ్రీ

జన జాతివాడైన చలం భక్తుడై శ్రీ రమణాశ్రమం చేరటం మహాకవి శ్రీశ్రీ కి నచ్చలేదు.

చలాన్ని యేడిపించాలనీ, పూర్వ జీవితానికి రమ్మనమని ప్రోత్సహించాలనే ఆలోచననతో ఓ కార్డు వ్రాశాడు శ్రీశ్రీ -

'స్కాచ్ విస్కీ త్రాగి నేను యీ ఉత్తరం వ్రాస్తున్నాను' అని ప్రారంభించాడు.

అంటే యిటువంటి మజా అయిన జీవితాన్ని వదలి, నీరసపుగాళ్ళలో, బూడిద వైరాగుల్లో కలిసిపోయావని ధ్వని వెక్కిరింత!

మహాకవి చలం ఈ ధ్వనిని పసికట్టి శ్రీశ్రీ కి ఓ చురక అంటిస్తూ వెంటనే వ్రాశాడు.

ఇక్కడ సాటిలేని దివ్యోన్మత్తతను ప్రసాదించే పానీయాన్ని కనుగొన్నాను. దీనిని సేవిస్తే శాశ్వతానందంలో నిలిచిపోతాం! అనంత దుష్ఫలితాలు వుండవు. ఇది స్వయం ప్రకాశమైనది! - అని కార్డులో వుంది.

అంటే అర్థం 'నీవు త్రాగే విస్కీ క్షణికానందాన్నిస్తుంది. పైగా తెలివిని పోగొడుతుంది. శాశ్వతానందాన్నిచ్చే పానీయం వుంది. దీనిని త్రాగగల చేవ, ధీశక్తి వుంటే రా! ' అని శ్రీశ్రీ పిలుపు.

# పసి [డి] మనస్సు

- సుశీలా ప్రసాద

దేవుడి ఊరేగింపు వస్తుందని యింట్లోవాళ్ళు పళ్ళెంలో పళ్ళు, కొబ్బరికాయ, బియ్యం, బెల్లంముక్క, పూలు అన్నీ సర్ది బల్లమీద పెట్టారు. ఆ యింట్లోని పసిపాప 'అమ్మా! అవన్నీ ఎందుకు?' అని తల్లిని ప్రశ్నించింది. "దేముడు వస్తాడమ్మా! వచ్చినప్పుడు యివన్నీ యివ్వాలి. గుమ్మంలో నిలబడి చూస్తూవుండు" అన్నది తల్లి.

చిట్టిపాప గుమ్మంలో నిలబడింది. ఎంతకీరాలేదు దేవుడు. వీధి గడప మీద కూర్చుని యెదురు చూస్తోంది. ఇంతలో చింకిబట్టలు చింపిరిజుట్టు, చేతిలో బొచ్చె పట్టుకుని ఒక ముసలి ముష్టివాడు వచ్చాడు. ఠకీమని పాప లేచినిలబడి 'నువ్వేనా ఆ దేవుడివి?' అని అడిగింది వాడిని. వాడు అవును కాదు అనకుండా లోపలికి తొంగి చూస్తూ "ఆకలి వేస్తోంది. ఏమైనా వుంటే తినడానికి పెట్టండమ్మా!" అని కేక పెట్టాడు.

'పాపం! దేవుడికి ఆకలివేస్తోందిట' అని ఆ చిన్ని పాపకు జాలి వేసింది. 'తనకి ఆకలివేస్తే అమ్మ అన్నం పెడుతుంది కదా' అనుకుంటూ, 'ఉండు. నీ కోసమే పళ్ళెంలో అన్నీ పెట్టారు.' అంటూ గబగబా వెళ్ళి పళ్ళెం తెచ్చి వాడికివ్వబోయింది. ముష్టివాడేకాని, మోసం చేసేవాడు కాదు వాడు. చాలా మంచివాడు. పాప అమాయకత్వానికి వాడికి ముచ్చట వేసింది. పళ్ళెంలో పళ్ళు మాత్రమే తీసుకుంటూ "నాకివి చాల్లే తల్లీ! శానాళ్ళు బతుకు!" అని దీవిస్తూ వెళ్ళిపోయాడు.

'దేవుడొచ్చి ఆకలేసిందని, పళ్ళు  చాలని తీసికెళ్ళాడమ్మా' అని సంబరంగా కేకపెట్టింది చిట్టిపాప.

దేవుడు ఎక్కడి నుంచో రానక్కర్లేదు. అటువంటి పసి

హృదయాలలోనే దైవం నెలకొని ఉంటాడు. అందుకే 'బాలోన్మాద పిశాచవత్' లా ఉంటారు పరమహంసలైన జ్ఞానులు. వారు అన్నిటా, తమలో నిత్యమూ దైవాన్ని దర్శిస్తూనే వుంటారు. ఆనందంలో ఓలలాడుతూ వుంటారు.

• • • • • • • • • • • • • • • • • • • • • • • • • • • • • • • • • • • • • •

(బాబూజీ ఉవాచ - 4వ పేజీ తరువాయి భాగం)

భగవానుడు సంస్కారవంతులైన జీవకోటి తప్పదారి పడితే ఊరుకుంటాడా! వాల్మీకి కిరాతకుడు, బోయవాడు. అతనిని వుద్ధరించడానికి దయామయుడైన భగవానుడు నారద మహర్షి ద్వారా సక్రమమైన మార్గంలోకి తీసుకొచ్చిన విషయం మీకందరికి తెలిసినదే. నారదుడు వాల్మీకికి ఒక షార్టుకట్ ద్వారా ఆత్మ దర్శనం పొందే మార్గాన్ని చెప్పాడు. చక్కని మంత్రాన్ని ఉపదేశించాడు. వాల్మీకి ఆ మంత్రాన్ని ధ్యానించి ఆ మంత్రరాజములోని అమృతాన్ని అందుకొన్నాడు. వాల్మీకి ధ్యానించిన రామనామము అతనిలో పేరుకుపోయిన క్రూరత్త్వము, అహంకారము దగ్ధమై అమృతాన్ని ప్రసాదించింది.

ఆయన అనుసరించిన విధానము జీవకోటికి మార్గదర్శకమైనది. వాల్మీకి మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము, సత్యము, శాంతి, దయ, ప్రేమగా మారిపోయాయి. అందువల్లనే ఆయన హృదయము నుంచి ద్రవించే అమృతమే రామాయణ మహాకావ్యము! అటువంటి వారు మహత్ములు, జ్ఞానులు. వారు మోక్షస్థితిలో ఉండి, వారిని ఆశ్రయించిన వారికి మోక్షాన్ని ప్రసాదించగల్గుతారు. అంతేకాని అష్టసిద్ధులకు దాసులయిన వారికి మోక్షము లభిస్తుందా? బియ్యపు గింజను ఎంతసేపు నీటిలో నానబెట్టినా మొలకెత్తదు గదా! కాని వడ్లగింజకు తేమ తగలగానే మొలకెత్తుతుంది గదా! అలాగే అహంకార మమకారములనే పొరలు కమ్మిన మానవులు జన్మకు రాక తప్పదు గదా అని అన్నారు. శ్రీ బాబూజీ మహారాజ్!

# బంగారు క్షణాలు

- డా॥ స్వర్ణముఖి

(గత సంచిక తరువాయి)

శేషమ్మగారు -

'శరణాగతుడగు శిష్యుని కరుణామృత దృష్టి చేత గని
మోదము ముప్పిరిగొన మృదువాక్యములను
పరమ దయాళుండు గురుడు భక్తా వినుమనెనూ
సంశయ మిక బాధింపదనెనూ
పరిపూర్ణ మొకటి లే నెరుకానె దొకటి
పరిపూర్ణ మెరుకాల నెరిగీ యొరుకమాను
భక్తా వినుమనెను, సంశయమిక బాధింప దనెనూ!'

శ్రీబాబు -

దాని అర్థం చెప్పమ్మా!

శేషమ్మగారు -

గురుదేవుడు తన శిష్యుని యొక్క భక్తికి, పట్టుదలకి మెచ్చి, కరుణామృత దృష్టితో చూస్తూ, అతడి శ్రద్ధా భక్తులకి మహదానందం పొంది, చల్లటి, మృదువైన వాక్కులతో చెబుతున్నాడు 'నాయనా! భక్తా! నీవు నా కృపకి పాత్రుడవయ్యావు. నీ యందు నాకు నమ్మకం కుదిరింది. కనుక నీకు పరిపూర్ణమైనటువంటిది, సంశయ రహితం చేసేది అయిన ఆత్మజ్ఞానాన్ని బోధిస్తాను. ఇక నిన్ను సందేహమనేది బాధించకుండా చూస్తాను' అన్నాడు.

శ్రీబాబు -

'ఆత్మవిద్య ఎటువంటిది? భవబంధ ప్రముచ్యతే. ఏ విద్య అయితే నిన్ను జీవబంధ విముక్తినిగా చేస్తుందో, ఏ విద్య అయితే పరిపూర్ణమైన సుఖశాంతులనిస్తుందో, జననమరణ రహితం చేస్తుందో, అట్టివిద్యని

నీకు బోధిస్తాను అంటున్నాడాయన. ఆహా! ఆచార్యుని ప్రేమ యెంత గొప్పదో చూశారా! గురుప్రేమకి పాత్రులయితేనే కదా యీ జన్మకి సార్థకత! ఇంకా ఏమన్నారమ్మా గురుదేవుడు?

శేషమ్మగారు -

'నానోట మాట వెంబడి తానెప్పుడూ
సంచరించె తగ నీచిత్తం బే నది గని యీ
బోధ విధానము
నీ కిస్తి దీన్ని, దాచుకో సుమ్మీ, నిత్యము నీవు
చూచుకో నమ్మీ యే నరుడైన నిన్నీ బోధ
నడిగితే
వాని మనసరయాకా వానికి జూపేవు,
దాచుకో సుమ్మీ
నిత్యము నీవు చూచుకో నమ్మీ!!

శ్రీబాబు -

'ఆ! అదీ కీలకం! గురుదేవుడు చెప్పిన బోధ యెంతో గోప్యంగా, జాగ్రత్తగా మనసులో దాచుకోవాలి. ఎవరికి పడితే వారికి గురు తత్త్వాన్ని వెల్లడి చేయకూడదు. వాడు నిజమైన భక్తుడవునా, కాదా అని తెలుసు కోకుండా, వాడికి గురుతత్త్వాన్ని గురించి చెప్పకూడదు. ఎవరికిపడితే వారికి చెబితే, దాని విలువ తెలియక వ్యర్థమయిపోతుంది.

అదే 'శివ పంచాక్షరీ ఉపనిషత్తు' కూడా చెబుతోంది - 'గురుం న వదేత్ అభక్తాయ న ప్రకాశయేత్' అని. కనుక గురుమూర్తి వుపదేశించిన బోధని అత్యంత శ్రద్ధతో మీ మనసులలో దాచుకుని నిరంతరం దానిని మననం చేస్తూ, ఆచరణలో పెట్టండి. దానివలన మీరు చేరవలసిన గమ్యాన్ని చేరుతారు. సచ్చిదానంద స్వరూపులవుతారు. తరించ గలుగుతారు. ఇక మిగతాది తరువాత చెప్పుకుందాం!!

-సశేషం

# సన్నిధిలో సంభాషణ

- పరాశర ప్రసాద్

28.12.85

"బదరీ నారాయణుడు అంటే ఎవరండీ? గురువుగారూ?" అని శ్రీ బాబు ప్రశ్నించినపుడు బాధనారాయణుడు అంటే బదరీలో ఉండే నారాయణుడు అని గురువుగారు సమాధానమిస్తూ 'బాధ' అనే మాటని ఒత్తి పలికారు. శ్రీబాబు మాట్లాడుతూ "ఆవిడ బాధ నారాయణుడు అని ఒత్తి పలుకుతుంటే మేమందరము అర్థం కాక అవస్థ పడుతున్నాము. ఈ ప్రక్కనే కూర్చున్న డాక్టరుగారికి బి.పి ఎక్కువైంది. మనకెవరికైనా బి.పి పెరిగితే ఆయన తగ్గిస్తాడు. మరి ఆయనకే పెరిగితే ఎలా? నేనా డాక్టర్ని కాదు. ఏమండీ జోగారావుగారూ ఏమంటారు? ఏమిటండీ ఇక్కడ ఇంత గొడవ జరుగుతుంటే అలా నిదురపోతారు? చూడండి మీరు బాగా గురకపెట్టి నిద్రపోతుంటే మీ శిష్యులు పి.హెచ్.డి కోసం మీ మీద ఈగలు తోలలేక చచ్చేవారు. పోనీ మీరు మెలుకువగా వున్నారనుకోండి అప్పుడు శూన్యంలో ఉండేవారు. బుద్ధుడు అన్ని వేళలా మీరు పొందిన స్థితిని మెలకువలో అనుభవించాడు. ఎందువలన అంటే సర్వసృష్టిని ప్రకాశింపజేసే దానిని తెలుసుకున్నాడు" అన్నారు.



జోగారావుగారు మాట్లాడుతూ 'బాబూజీ! పదిమందిలో నా పరువు తీసేశారు. నన్ను పదిదెబ్బలు ఒంటరిగా కొట్టినా ఫర్వాలేదు' అన్నారు. శ్రీబాబు మాట్లాడుతూ "నీలో ఆ తమోగుణాన్ని వదిలించటానికే అలా చేశానయ్యా. గురువుగారు నియోగి బిడ్డ. అందువలననే ఆవిడకి పౌరుషం ఎక్కువ. మరి మీరూ అంతేనా? కాని నేను మాత్రం గొల్లవాడిని" అని శ్రీబాబు అనగానే గురువుగారు మాట్లాడుతూ 'ఏమిటండీ! అలా అంటారు?' అని అన్నారు.

శ్రీబాబు కలుగచేసుకొని "అవును. గొల్లవాడినే! అలా భయపడతారేమిటండీ. కాదంటే రమ్మనండి ఎవరినైనా చెపుతాను. ఈ

బాబు మీ హృదయంలో సింహాసనం వేసి ప్రేమతో ఆహ్వానిస్తే మీ హృదయాన్ని అలంకరిస్తాడు. మరి ఇప్పుడు ఎవరినండీ నేను. ఎంతటి పండితులైనా ఆ గొల్లవాడి అనుగ్రహం లేనిదే తరించగలరా? చెప్పండి. అయినా మీలాంటి భక్తులకు నేను దాసానుదాసుడిని" అని అన్నారు.

"బదరీ నారాయణుడు మీలోని బాధని నిర్మూలిస్తాడు. ఆయన బదరికాశ్రమంలో నరనారాయణ రూపంలో తపస్సు చేసుకున్నాడు. అంత తపస్సులో కూడా సర్వసృష్టి భారాన్ని తన భుజస్కంధము మీద ఉంచుకొని ఎవరికి ఏది కావాలో అది అందజేస్తూ ఏ భక్తునికీ లోటు రానీయలేదు. బదరికాశ్రమం చాలా ప్రశాంతంగా ఉంటుంది. దానిని ఆశ్రయించిన వారికి బదరీఫలాలు అందుతాయి" అన్నారు. జోగారావుగారు మాట్లాడుతూ 'అక్కడ బదరీఫలాలు లేవు బాబూ' అన్నారు. శ్రీబాబు మాట్లాడుతూ "వారు పొందింది బదరీనారాయణుడు అందించిన ఫలాలయ్యా. అంతేకాని మీలాగా చుట్టు ముళ్ళ కంచెలు వేసుకు కూర్చుంటారనుకున్నారా?" అన్నారు.

శ్రీబాబు మళ్ళీ మాట్లాడుతూ "సర్వసృష్టిని ప్రకాశింపజేసే నారాయణుని తపస్సు భంగపరచటానికి ఇంద్రాది దేవతలు రంభని పంపించారు. నారాయణుడు రంభని చూసి 'నీకు సౌందర్యము ఎక్కడ నుంచి వచ్చింది? దానిని ప్రకాశింపచేసే శక్తి నాదే' అనేసరికి రంభకి జ్ఞానోదయమైంది.

నారాయణుని ఎవరు ధ్యానిస్తారో వారిలోని నానాత్వము హరించి వారు మాధవత్వాన్ని పొందుతారు. మానవుడు చాలా అదృష్టవంతుడు. ఎందువలన అంటే దేవతలు కూడా తరించవలెనంటే మానవజన్మ ఎత్తవలసిందే. మానవుడు నరజలధి నుండి తరించాలి అంటే సత్య గురుమూర్తిని ఆశ్రయించాల్సిందే. ఆయన నీలో అహంకార మమకారములను, కామినీ కాంచనాల మీద వ్యామోహాన్ని హరిస్తాడు. నీ మనస్సు ఆయన ముఖ కమలము నందుగాని, నయన కమలమునందు గాని, కరకమలమునందు గాని పాదకమలములందు గాని ఎక్కడ నిలిపినా సరే, మధురాన్ని గ్రోలుతావు."

- సశేషం

(గత సంచిక తరువాయి) **యోగవాశిష్ఠము** - సుషుమ్నా ప్రసాద

తర్వాత కొలది రోజులలో, వొక బ్రాహ్మణునకు తన యింటిలో, అతిధ్యమివ్వటం జరిగింది, గాధి యిచ్చిన ఫలాలు, తేనె తృప్తిగా భుజించి, యెంతో ఆనందించాడు. వారిరువురు సంధ్యా సమయములో, ఆచరించవలసిన దైనందిన కర్మలనాచరించారు, సూర్యాస్తమ సమయంలో, వారిరువురూ, ఆసీనులై, అనేక విషయాలు చర్చించుకొన్నారు. ఆత్మ జ్ఞానానికి సంబంధించిన కథలు గుర్తు తెచ్చుకొన్నారు అలా సంభాషణ కొనసాగిస్తూ, గాధి ఆ బ్రాహ్మణునితో "అయ్యా, మీరెందుకంత బక్కచిక్కి, కృశించి వున్నారు" యని ప్రశ్నించాడు.



అప్పుడా యతిథి యిలా సమాధానమిచ్చాడు "నేను ప్రసిద్ధమైన కీరదేశములో వొక నెల గడిపాను, అక్కడ వొకతను యీకథను చెప్పాడు. "కీర దేశాన్ని వొక రాజు ఎనిమిది సంవత్సరాలు పరిపాలించాడు, తర్వాత ప్రజలా రాజు కుక్కమాంసము తినే ఛండాల కులస్తుడని తెలుసుకొన్నారు. వెంటనే రాజవంశీయులు, ప్రజలు, బ్రాహ్మణులు ప్రాయశ్చిత్తం చేసుకొనటానికై చితి పేర్చుకొని, అగ్నిలో దూకి మరణించారు. వెంటనే శ్మశాన వాటికగా మారిన కీర రాజ్యం చూచి, రాజు కూడ అగ్ని ప్రవేశం చేసి మరణించాడు. ఆ వార్త విన్న నేను, ఆ రాజ్యాన్ని వదలి, పాప ప్రక్షాళనము చేసుకొనటానికై తీర్థయాత్రకై, ప్రయాగ చేరుకొన్నాను. అక్కడ నేను తపస్సాచరించి, చాంద్రాయణ వ్రతము (కఠిన వుపవాసాలతో చేసే వ్రతము) చేసాను. అందుకే నేనింత బక్కచిక్కానని" బ్రాహ్మణుడు సమాధానము చెప్పాడు.

ఈ ఉదంతాన్ని విని, గాది ఆశ్చర్య చకితుడైనాడు, తనలో తానిలా మధన పడ్డాడు, బంధువుల మధ్యనామరణము చూడటం, నిస్సందేహముగ నా మనస్సు చేసిని మోసము కాని నా స్వప్నతులిక దృశ్యములో చూచిన ఛండాలుని కథ, బ్రాహ్మణుడు ఛండలా నగరము

వెళ్లినందుకు పాపపరిహారంగా చేసికొనేందుకు, చాంద్రాయణ వ్రతమాచరించటం తనిని దిగ్భ్రమకు గురిచేశాయి. కనుక తను వెంటనే భూటాన్ దేశమునకు వెళ్ళి, ఆ ఛండాలునికి సంబంధించిన వివరాలను తెలుసుకోవాలని నిశ్చయించుకొన్నాడు.

"అందుచేత తన పూర్వజన్మలో ఛండాలునిగ వున్నప్పటి సంఘటనలలోని సత్యాన్ని ఋజువు చేసుకొనేందుకు తాను ప్రయాణమయి తాను స్వప్నంలో చూసిన దేశం చేరుకొన్నాడు. అక్కడ ఛండాల కులస్తులుండే తన జన్మ స్థలాన్ని సందర్శించాడు, ఆ ఛండాలవాడ నివాసులు కటంజమ, అతని జీవితాన్ని గురించిన సంఘటనలను వివరంగా చెప్పారు.

- సశేషం

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

నవంబర్ 2015

6 శుక్ర: శ్రీగురుదశమి - రాత్రి 7గం. శ్రీసద్గురుపాదపూజ

11బుధ : దీపావళి - రాత్రి 7గం. శ్రీసద్గురుపాదపూజ

25 బుధ : గురుపూర్ణిమ - రాత్రి 7గం. శ్రీసద్గురుపాదపూజ

వివరములకు : శ్రీ నరసింహారావు సెల్ - 94912 22652,
శ్రీ ఎన్. సుబ్బరాజు సెల్ - 94403 77399

డిశంబరు 2015

6 ఆది: శ్రీ గురుదశమి - రాత్రి 7గం. శ్రీ సద్గురు పాదపూజ

# శ్రీకృష్ణుడెక్కడ ఉన్నాడు?

- టి. వాస్వని

ఆమె ఒక పల్లెటూరి పిల్ల. పేరు దయ. ఆమె రోజు పశువులను మేతకు బీడుకు తోలుకుని పోతుంది. సాయంత్రానికి పాటలు పాడుతూ యింటికి తిరిగి వస్తుంది.

ఒకనాడు దయ ఒంటరిగా బీడులో వున్నప్పుడు ఆమెకు కొన్ని మాటలు వినిపించాయి. శరీరమంతా శ్రవణేంద్రియం చేసుకుని విన్నది. 'కృష్ణా! కృష్ణా!' అని వినబడింది.

దయ వాళ్ల అమ్మను అడిగింది, 'అమ్మా! కృష్ణుడంటే ఎవరే? ఎక్కడ వుంటాడే?' అని. 'కృష్ణుడంటే దేవుడు. అడవిలో వుంటాడు' అని యథాలాపంగా చెప్పింది వాళ్ల అమ్మ.

దయకు ఆ రాత్రంతా నిద్రపట్టలేదు. ఆమె పూర్తిగా కృష్ణుడి గురించే ఆలోచనలో మునిగిపోయింది. ఇప్పుడే కృష్ణుణ్ణి కలుసుకోవాలని ఆ చీకటిరాత్రి ఒంటరిగా బయలుదేరింది. 'కృష్ణా! నువ్వు అడవిలో వుంటావట! నిన్ను దర్శించటానికి వంటరిగా బయలుదేరి వచ్చానయ్యా!' అంటూ యెలుగెత్తి పిలిచింది. 'ఇంటికి పో! అడవిలో నువ్వు నన్ను కనుక్కోలేవు' అని ఆమెకు ఒక వాణి వినిపించింది.

ఆమె ఆ వాణి ఆదేశాన్ని శిరసావహించి యింటికి వచ్చేసింది. కాని ఆమెకు రోజూ 'అడవిలో నీవు నన్ను కనుక్కోలేవు' అని వినబడుతోంది. అయితే దాని అర్థం ఆమెకు బోధపడలేదు. పండితులెందరినో అడిగింది. కాని యెవరూ విశదపరచలేకపోయారు.

ఒకనాటి మధ్యాహ్నం యెవరో తలుపు తట్టారు. దయ తలుపు తెరిచింది. ముడతలు పడిన శరీరంతో ఒక నిరుపేద వృద్ధురాలు యెదురుగా ప్రత్యక్షమైంది. 'అమ్మా! నీకేం కావాలి?' అని దయ ఆదరంతో అడిగింది. 'అమ్మా! ఆకలికి అలమటిస్తున్నాను. దాహం! కప్పుకోవటానికి వస్త్రం కూడా లేదు. కనికరించు' అన్నది ఆ వృద్ధురాలు దీనంగా. వెంటనే దయ షడ్రశోపేతమైన భోజనం తయారుచేసి, ఆ వృద్ధురాలికి వడ్డించింది. తరువాత తన దగ్గర వున్న మంచి పట్టుచీర తీసి కట్టబెట్టింది.

చూస్తూ వుండగానే ఆ ముసలమ్మ మాయమై ఆ స్థానంలో వేణునాదం చేస్తూ నెమలి పింఛంతో శ్రీకృష్ణుడు ప్రత్యక్షమయ్యాడు!

పరవశమై దయ శ్రీకృష్ణుని పాదాలమీద పడింది. కృష్ణుడు ఆశీర్వదించాడు. ఆ జగన్మోహనాకారాన్ని చూసి, ఆనంద పరవశంతో, తేనెలొలికే స్వరంతో, 'కృష్ణా! నిన్ను మాటిమాటికి దర్శించే ఆ ఉపాయం చెప్పు' అని అడిగింది.

'నాకు దాహానికి నీరు యిచ్చావు. ఆకలికి అన్నం పెట్టావు. కట్టుకోవటానికి వస్త్రం యిచ్చావు. ఇందుకు బహుమతిగా నీకు యిప్పుడే దర్శనం యిచ్చాను. ప్రతి ఆకలిగొన్న వాణ్ణీ నేనే! దాహం గొన్నవాణ్ణీ నేనే! వస్త్రంలేని వాణ్ణి నేనే!' అన్నాడు శ్రీకృష్ణుడు.

అప్పుడు అర్థం అయింది దయకు 'అడవిలో నీవు నన్ను కనుగొనలేవు అన్నమాటకు అసలు అర్థం!!



# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

నవంబర్ 2015

6 శుక్ర : శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

9 సోమ : మాస శివరాత్రి, పావులూరు బ్రాంచిలో ఏకాహం.

10 మంగళ : నరకచతుర్దశి, శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం

11 బుధ : దీపావళి, అమావాస్య - శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన, రాత్రి 8గం.లకు టపాకాయలు కాల్చుట

15 ఆది : నాగుల చవితి.

22 ఆది : ఏకాదశి - శ్రీసద్గురుపాదపూజ, ఏకాహం సంకీర్తన.

23 సోమ : క్షీరాబ్ధి ద్వాదశి - శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

25 బుధ : గురుపూర్ణిమ, గురునానక్ జయంతి, శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన, సాయంత్రం 6గం.లకు జ్వాలాతోరణం, శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి ఊరేగింపు. చాతుర్మాస్య దీక్ష విరమణ.

డిసెంబర్ 2015

నవంబర్ 28 నుండి డిసెంబర్ 6 ఆదివారం వరకు శ్రీసద్గురుదేవుల సప్తవింశతి (27వ) వార్షిక పుణ్యారాధన మహోత్సవాలు.

6 ఆది : శ్రీగురుదశమి

9 బుధ : మాసశివరాత్రి

11 శుక్ర : అమావాస్య

17 గురు : ధనుర్మాస ప్రారంభం. శ్రీ సుబ్రహ్మణ్య షష్ఠి.

21 సోమ : ముక్కోటి ఏకాదశి; గీతాజయంతి - గీతాపారాయణ, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

25 శుక్ర : పూర్ణిమ, క్రిస్మస్ - శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం.

# ప్రవచనము

సేకరణ -రమణ ప్రసాద్

(హైదరాబాదు సత్సంగాలలో కేసరి ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీమాతాజీ వారి బోధ సంక్షిప్తంగా..............................)

హనుమంతుడికి యిష్టమైనది రామనామము. మనకి యేది యిష్టం? గురుదేవుల నామం. సర్వము రాముని స్వరూపమే. చిడతలు పట్టుకొని రామనామం చేస్తాడు హనుమంతుడు ఆనందంతో. గురుదేవులను ఆశ్రయించిన మనం యిలా రామ నామం చేస్తే ఆనందం మన సొత్తే. గురుదేవునికి రాముడంటే యిష్టం. కాబట్టి మనందరికీ రాముడంటే యిష్టం. వారికి ఆంజనేయుడంటే యిష్టం. కాబట్టి మనకీ ఆంజనేయుడంటే యిష్టం. ఆంజనేయుడు యేదైతే చెప్పాడో దానిని ఆచరించాడు. మానవుడు చెప్పినది ఆచరించడు. ఆంజనేయుడు కదలడు. ఉన్నచోటు నుండి తన తోకతో శిక్షిస్తాడు. అందరిలో వుండి వారి వారి స్థితిని బట్టి ఫలితాలనిస్తాడు.

ఉత్తమమైన మానవజన్మ వచ్చినందుకు ఉన్నది ఒక్కటే అని గుర్తించాలి. అదే సత్యవస్తువు. వ్యర్థమైన ఆలోచనలతో మన మనస్సు కలుషిత మవుతుంది. శ్రీగురుదేవులు మనలను చేరదీసి నిజతత్త్వాన్ని గుర్తించటానికి అవకాశం యిచ్చారు.

జిహ్వే కీర్తయ కేశవం మురరిపుం చేతో భజ - ఈ పాసురం ముకుందమాల లోనిది. 40 పాసురాల మణిహారం. తన ఆరాధ్యదైవమైన శ్రీరంగనాధునికి సమర్పించాడు. మనం దేవుడిని అనేక రూపాలుగా పూజిస్తాం. రామునిగా, కృష్ణునిగా, షిరిడి సాయిలా. కాని దేవుడు ఒక్కడే.

కులశేఖరాళ్వారు శ్రీరంగనాధుని సేవకి సర్వసంగ పరిత్యాగిగా వెళ్తుంటే భార్యకూడా వెంట నడిచింది. కాని తన భర్తకు పాలివ్వటానికి వీలుగా వుంటుందని ఒక బంగారు గిన్నె జోలెలో వేసుకుంది. దారిలో అడవిలో ప్రయాణిస్తుంటే దొంగలు చుట్టు ముట్టారు. కులశేఖరులు భగవన్నామం చేస్తూ వెళ్తున్నారు. ఆయనకు భయం ఏముంది? కాని ఆయన భార్య మాత్రం భయపడి, ఆయనను ప్రక్కకు పిలిచి బంగారు గిన్నె సంగతి బయటపెట్టింది. ఆయన ఆ గిన్నెను దొంగలకు యిచ్చెయ్య

మన్నాడు. ఆమె అలానే చేసింది. అప్పుడు ఇద్దరూ నిర్భయంగా ముందుకు సాగిపోయారు.

భగవంతుడు అందరివాడు. ఆయన అందరి ప్రాపర్టీ. శ్రీరామ కృష్ణ పరమహంస వివేకానందునితో 'ఒక కప్పు నిండా పాలు వుంటే చీమ ఎక్కడి నుంచి త్రాగుతుంది?' అని అడిగాడు. 'కప్పు అంచు మీద నుండి త్రాగుతుంది' అని చెప్పాడు వివేకానందుడు. రామకృష్ణులు మాట్లాడుతూ "పిచ్చివాడా! ఆ కప్పులో వున్నదంతా అమృతమే కదా! అందులో మనిగి పోయినా అది చావదు. అది అమృతం కాబట్టి" అన్నారు.

రామనామము రమ్యమైనది. అది సోమ సూర్యాగ్నులను ప్రకాశింప జేసేది. ఆత్మానాత్మ క్రమము తెలిపేది. ఆత్మభావాన్ని ఎరుక పరచేది. పాలల్లో తోడు వేస్తే పెరుగు అవుతుంది. అలాగే జీవునిలో రామ నామం అనే తోడు వేస్తే రాముడే అవుతాడు. శ్రీగురుదేవులు యిచ్చిన మంత్రరాజాన్ని ఒకే చోట కూర్చుని ధ్యానిస్తే మనస్సు పరమాత్మ స్వరూపాన్ని పొందుతుంది. శ్రీగురుదేవులు యిచ్చిన మంత్రాన్ని ఉపాసన చేస్తే సాధకుడు ఆ మంత్ర స్వరూపాన్ని పొందుతాడు. స్వధర్మంలో వుంటూనే ఆత్మజ్ఞానాన్ని పొందవచ్చు.

గురుదేవుడు మనలో వున్నాడు, అంతటా వున్నాడు. ఆంజనేయుని రామ భక్తిని మనందరికీ తెలియజేసిన శ్రీగురుదేవులు అట్టి భక్తిని, శక్తిని, ఆత్మజ్ఞానాన్ని మనందరికీ ప్రసాదించెదరు గాక! సుఖీభవ! సుఖీభవ!



# పరిప్రశ్నేన సేవయా - పరాశర ప్రసాద్

దుర్లభో విషయ త్యాగః। దుర్లభం తత్త్వ దర్శినః।

దుర్లభా సహజావస్థ। సద్గురోః కరుణా వినా॥

మనస్సు సహజావస్థలో వుండాలంటే విషయ వాసనలను త్యజించ వలసినదే. అది చెప్పినంత తేలిక కాదు. మనస్సు చంచల స్వభావాన్ని



కోల్పోయినప్పుడే అది ఆత్మజ్ఞానాన్ని గ్రోలగలుగుతుంది. అది సాధ్యమా? సద్గురు దేవులు మనస్సును గురించి ప్రస్తావిస్తూ "మీ యింట్లో సంచరించే ఎలుకని పట్టుకోలేరు కదా! ఇంక మీ మనస్సుని యేం నియంత్రించ గలుగుతారయ్యా? మీ మనస్సుని సద్గురుమూర్తి దివ్య చరణారవిందాలపై నిలిపితే అది స్థిరపడుతుంది. మనస్సు అంటే యేమిటి? నీలోని భావనా పరంపరలే మనస్సు వునికిని తెలియజేస్తాయి. మనస్సు అనేది మాయా శక్తి. అది మానవునిపై తన ప్రభావాన్ని రెండు రకాలుగా చూపుతుంది. ఆవరణ శక్తిగా నీలోని వివేకాన్ని సూర్యబింబాన్ని ఆవరించిన మబ్బులాగా మరుగుపరుస్తుంది. మానవుడు నిత్యానిత్యవస్తు వివేకాన్ని కోల్పోవటానికి హేతువు మాయాశక్తి యొక్క ఆచ్ఛాదనే. అంతేకాదు విక్షేప శక్తిగా మనస్సుని విషయాదులపై సంచరింపజేసి, నీ నిజ స్థితిని తెలిసికో నీయక నీ ముందు వేరొక భావాన్ని నిలబెడుతుంది. పరిభ్రమణం విక్షేపశక్తి లక్షణం. ఈ రెండు లక్షణాల ప్రభావం చేత మనస్సు అజ్ఞాన అంధకారములో మునిగి మసక చీకటిలో త్రాడును చూసి సర్పముగా భ్రాంతి చెందినట్లు దేహభావన చేత 'నేను, నాది' అని అహంకార పూరితుడై సంచరిస్తాడు.

దీని నుండి బయటపడే మార్గం లేదా? వుంది. అది కేవలం సద్గురుమూర్తి కరుణాకటాక్షం పైన ఆధారపడి వుంటుంది. సద్గురుమూర్తి కరుణాకటాక్షమును పొందే మార్గం యేమిటి? అది ధనధాన్యాలకు అందేదికాదు. అది కేవలం ఆయన ప్రసాదించిన లక్ష్యార్థ సాధన ద్వారా సాధ్యపడుతుంది. మనస్సుని జయించటం మనము చెప్పుకున్నంత తేలిక కాదు సుమా! మీరు చేసే సాధన మనస్సుని సంస్కరించటానికే అన్న విషయం గ్రహించండి" అన్నారు శ్రీగురుదేవులు.

# ఆ చల్లని అమృతహస్తం అందించిన వరదానాలెన్నో

- పెనుమాక నాగేశ్వరరావు

ఆ చల్లని అమృతహస్తం అందించిన వరదానాలెన్నో
ఆ చల్లని హృదయాకాశంలో చేరుటకున్న ధన్యులెందరో
ఈ అనంత కాలంలో ధరించిన అవతారాలెన్నో
మానవ కళ్యాణం కోసం చేయించిన యాగాలెన్నో ।ఆ చల్లని।

ఆ పచ్చని ప్రాకారంలో ప్రార్థించే గొంతులు ఎన్నో
సేవించే చేతులు ఎన్నో, పూజించే మనుషులు ఎందరో
కడుపు నిండిన అన్నార్తుని మదిలో కలిగిన తృప్తికి విలువెంతో
కడుపు పండిన తల్లుల కన్నులలో మెరిసిన సంబరమెంతో
।ఆ చల్లని।

ఒక భక్తుని రక్షణకోసం వెచ్చించిన సమయం ఎంతో
ఒక శిష్యుని దక్షత కోసం అర్పించిన శక్తులు ఎన్నో
ఒక జీవుని కైవల్యం కోసం పణమొడ్డిన శస్త్రాలెన్నో
ఒక దుష్టుని శిక్షించుటకై వాడబడిన అస్త్రాలెన్నో
।ఆ చల్లని।



(గత సంచిక తరువాయి) **గీతాధ్యయనమ్** - రమణ ప్రసాద్

## విభూతి యోగం

అహింసా సమతాతుష్టి
స్తపోదానం యశోయశః
భవన్తి భావా భూతానాం
మత్త ఏవ పృథగ్విధాః

(భ.గీ - 5/10)



బుద్ధి, జ్ఞానము, ఓర్పు, సత్యము, బాహ్యేంద్రియ నిగ్రహము, సుఖము, దుఃఖము, పుట్టుక, నాశము, అహింస, సమత్వము, సంతుష్టి, తపస్సు, దానము, కీర్తి, అపకీర్తి. ఈ నానావిధాలైన గుణాలు ప్రాణులకు నా వలనే కలుగుతున్నాయి. నా మీదే మనస్సు నిలిపి ప్రీతి పూర్వకంగా నన్ను సేవించే వారికి బుద్ధి యోగాన్ని (ఆత్మానాత్మ విచారణ రూప జ్ఞాన యోగాన్ని) నేను ప్రసాదిస్తాను. ఆ జ్ఞానం వల్ల వారు నన్ను చేరుతారు.

అర్జునుడు తనకు కలిగిన సందేహాన్ని అడుగుతున్నాడు. "నువ్వు పరబ్రహ్మవు. ఆది దేవుడవు. నారదుడు, అసితుడు, దేవలుడు వ్యాసుడు అందరూ చెబుతున్నారు. నువ్వు కూడా స్వయంగా నాతో చెప్పావు. నువ్వు సకలలోకాలలో యెలా వ్యాపించి వున్నావో, ఆ దివ్య మహిమలు నీవే చెప్పదగినవాడవు. నీ యోగ మహిమ గురించి, లీలా విభూతుల గురించి వివరంగా చెప్పు'.

భగవానుడు: నా ముఖ్యమైన విభూతులను గురించి వివరిస్తాను - "నేను ఆత్మను, సర్వభూతాల ఉత్పత్తి, స్థితి, ప్రళయ

కారణం నేనే. నేను ఆదిత్యాలలో విష్ణువును; జ్యోతులలో కిరణాలుగల సూర్యుడను; మరుద్గణాలలో మరీచిని; నక్షత్రాలలో చంద్రుడను; వేదాలలో సామవేదాన్ని; దేవతలలో ఇంద్రుణ్ణి; ఏకాదశ రుద్రులలో శంకరుణ్ణి; యక్ష రాక్షసులలో కుబేరుణ్ణి; పురోహితులలో బృహస్పతిని, మహర్షులలో భృగు; మాటలలో ఓంకారాన్ని; యజ్ఞాలలో జప యజ్ఞాన్ని; స్థావరాలలో హిమాలయాన్ని; వృక్షాలలో అశ్వత్థ వృక్షాన్ని, దేవర్షులలో నారదుడిని; గంధర్వులలో చిత్రరథుణ్ణి; ఆయుధాలలో వజ్రాయుధాన్ని, ఆవులలో కామధేనువును, రాక్షసులలో ప్రహ్లాదుడను, మృగాలలో సింహాన్ని; పక్షులలో గరుత్మంతుణ్ణి; ఛందస్సులో గాయత్రిని; మాసాలలో మార్గశీర్షాన్ని; ఋతువులలో వసంతాన్ని - పరంతపా! నా దివ్య అనుభూతులకు అంతం లేదు. అయినా నేను క్లుప్తంగా నీకు వివరించాను.

అర్జునా! లోకంలో ఐశ్వర్యవంతము, శోభాపూరితము అయిన ప్రతి వస్తువు నా తేజస్సులోని ఒక అంశం అని గ్రహించు. ఈ సమస్త జగత్తు నా అంశంతో నిండి నిబిడీ కృతమై వున్నదని తెలుసుకో.

- సశేషం



# శ్రీకృష్ణ కర్ణామృతము

(గత సంచిక తరువాయి)

- సుశీలా ప్రసాద

అశ్రాన్తస్మిత మరుణాధరోష్ఠం ।
హర్షార్ద్ర ద్విగుణ మనోజ్ఞ వేణుగీతమ్ ।
విభ్రామ్య ద్విపుల విలోచనార్ధ ముగ్ధం ।
వీక్షిష్యేతవ వదనామ్బుజం కదాను ॥



తాత్పర్యము -

ఎడతెగని నవ్వుగలదియు, మిగుల నెఱ్ఱని పెదవిగలదియు, ఆనందముచే యినుమడించిన మనోహరమైన వేణుగానము గలదియు అరమోడ్పుతో త్రిప్పబడుచున్న కన్నులుగల ముద్దు లొలుకుచున్న కృష్ణా!నీ వదనాంబుజమును ఎప్పుడు చూడగలుగుదునో కదా!

సందెవేళ సన్నగా వర్షం పడుతోంది. వాకిట్లో ఉన్న జాజిపందిరి మీద అప్పుడే విచ్చుకుంటున్న జాజిపూలు వాన చినుకుల్లో తడుస్తూ స్నానాలు చేస్తున్నట్లున్నాయి. ఈ ప్రకృతి అందాలను గమనిస్తూ యీ సర్వ సృష్టికర్త అయిన నా మనోనాధుని గురించి ఆలోచిస్తున్నాను.

స్వామి ఎర్రని పెదవులపై చిరునవ్వు నిర్మలమైనది. అది మాయను పరిహసించేది, పరిహరించేది. నిజదాసులపై తనకు గల అనురాగాన్ని ప్రకటించే ఎర్రని పెదవులపై ఆ చిరునవ్వు సాధకులని లక్ష్యార్థమును చేర్చే సరైన దారిని చూపే కాంతులుగలది.

ప్రణవనాదమైన వేణుగానంలో నిండి రెండింతలైన ఆ చిరునవ్వు బ్రహ్మానందాన్ని అనుభవంగా అందిస్తుంది. ఆ పెదవులు తారకమంత్రాలను ప్రకటించే బోధామృతాల రసరాగగనులు.

అరమోడ్పు కన్నులు చరణాశ్రితులు ఎక్కడున్నాడోనని కలలో

చూస్తూ ధ్యానమగ్నులై వున్నవారి నిశ్చల చిత్తాలలో నిలిచి సాధనా ఫలాన్ని అందించేందుకు నాలుగు వైపులా త్రిప్పబడుతుంటాయి తామరరేకుల వంటి కనుదోయి.

భక్త భృంగాలకు ఆనంద మధువును అందించేందుకు సర్వ సన్నిద్ధంగా వుంటుంది. 'ఓ కృష్ణా! నీ సర్వాంగ సుందరమైన ముఖార విందాన్ని నేనెప్పుడు చూడగలనో కదా!' అనుకుంటున్న ఆ క్షణాన్నే నా కనుల ముందు నిలిచి వున్నాడు నా హృదయేశ్వరుడైన ముద్దుల కన్నయ్య. ఎప్పుడు ఎక్కడి నుండి ఎలా వచ్చావయ్యా? అంటే 'నీ మనస్సులో నుండి బయటకి రావటానికి రెప్పపాటు కూడా పట్టదే' అన్నాడు. 'నేను సర్వాంతర్యామిని, సర్వజ్ఞుడిని కదా' అన్నాడు.

ధ్యాస ఎల్లప్పుడూ నా మీదే నిలిపితే అదే ధ్యానం అవుతుంది. నీ ధ్యానంలో నేను సదా నిలిచి ఉండి నీకు కనిపించి మహదానందం అందిస్తాను. సరేనా!' అన్నాడు వేణుగాన లోలుడూ రసరాజ్య చక్రవర్తి అయిన పరబ్రహ్మ స్వరూపుడు.



# కర్మయోగము

(గత సంచిక తరువాయి)   - పూజ్య యోగిని శ్రీ చంద్ర కాళీ ప్రసాద మాతాజీ

అందుకే బుద్ధిమంతులైనవారు మొదట మనస్సును, జ్ఞానేంద్రియాలను నియమించుకోవాలి. మనస్సును అంతర్ముఖం చేసి బుద్ధిలో లీనం చేసి, కర్మేంద్రియాలను నిష్కామ కర్మలలో నియోగించి, అనాసక్తంగా విద్యుక్త కర్మలను ఆచరిస్తూ, ప్రతివారు కర్మయోగులు కావాలి. కర్మలలోని మంచిచెడ్డలను గురించిన భావనలను మనసులోకి రానీయక, 'పరమేశ్వరుడే యంత్రి. ఆయన యెలా నడిపితే అలా నడిచే యంత్రాన్ని నేను, కర్మలు, కర్మలను ఆచరించటం, ఆచరించేవాడు, అంతా భగవంతుడి లీల, యీ కర్మలను నిష్కామంగా ఆచరించినందువలన నా హృదయము క్షాళనమై నాకు కర్మ యోగము సిద్ధించటానికే భగవంతుడు యీ కర్మలు నా చేత ఆచరింపబడే అవకాశము నాకు కల్పించాడు' అనే భావనతో మనము కర్మలను స్వార్థం లేకుండా యజ్ఞార్థ బుద్ధితో ఆచరించటమే నిజమైన సాధన.

మామూలు పూజలలో మనం ఏదైనా నైవేద్యం పెడితే, తిరిగి ప్రసాదం వస్తుంది అని మనకు తెలుసు. కాని అదే యజ్ఞంలో అయితే హోమంలో వేసిన ఆహూతులన్నీ హుతం అవుతాయి. యజ్ఞంలో అర్పించ బడేవేవీ వెనక్కు తిరిగి రావని తెలుసు. అలా తెలిసీ యే ప్రతిఫలాపేక్ష లేకుండా అర్పణచేసే త్యాగబుద్ధినే యజ్ఞార్థబుద్ధి అంటారు.

యజ్ఞార్థ బుద్ధితో చేయబడిన కర్మలను వాటి ఫలాలతో సహా నిర్బీజంగా దగ్ధం అవుతాయి. అట్టి యజ్ఞార్థబుద్ధితో కర్మలను ఆచరించటమే కర్మకౌశలము. బాహ్యంగా అద్భుతంగా కనిపించక పోయినా, యే కర్మాచరణలో మనస్సు బుద్ధిలో, ఆ బుద్ధి ఆత్మలో లీనం అవుతాయో అట్టి కర్మయే నిజంగా అద్భుతమైనది. అట్టి కర్మాచరణం వలనే నైష్కర్మ్య సిద్ధి కలుగుతుంది. దీనినే కర్మలో అకర్మను చూడటం అంటారు. దీని వలన కర్మనిష్ఠ కలుగుతుంది. కర్మనిష్ఠ కలిగిన తరువాత జ్ఞాననిష్ఠ యోగ్యత, జ్ఞానయోగము, జ్ఞానము, సవికల్ప సమాధి, నిర్వికల్ప సమాధి, ఆత్మానుభూతి క్రమంగా కలుగుతాయి.

బ్రతికినంతకాలము యిలా కర్మలను ఆచరిస్తూనే వుండవలసి వస్తుందేమో అని కొందరు భయపడవచ్చు. అలా యే మాత్రం భయపడ వలసిన పనిలేదు. మన విశ్వాసం ఫలించి, మొగ్గ పువ్వుగా వికసించి నట్లు మనకు కూడా 'నేను సచ్చిదానందుణ్ణి' అన్న బోధ అపరోక్షంగా కలిగిన తరువాత కర్మలను ఆచరిచటం, ఆచరించక పోవటం అనే విషయంలో మనకు సంపూర్ణమైన స్వేచ్ఛ వుంటుంది. ఆ స్థితిలో మన చేత యే కార్యం ఆచరించబడినా అది సత్కార్యమే అవుతుంది. మనచేత అకార్యం అనేది ఆచరింపబడటం అసంభమవుతుంది. మనకు సంకల్పం అనేది వుండక, భగవంతుడే మన ద్వారా సంకల్పిస్తాడు.

మనకు కర్మాచరణంతో అవసరం లేకపోయినా, లోకానికి ఆదర్శ ప్రాయంగా వుండటానికి, నిష్కామ కర్మలు మన ద్వారా జరిగిపోతూనే వుంటాయి. కాని మనకు మాత్రం అవిస్త్ర మనకన్నా వేరైనవని కావని, 'నేను కర్మలను ఆచరిస్తున్నాను' అన్న దృష్టి కాని వుండవు. అవన్నీ మన లీలలుగా అవుతాయి.

శ్రీకృష్ణ భగవానుడు కర్మయోగంలో వివరించింది పరిశీలిస్తే, కర్మాచరణ ద్వారా జీవుడు యే స్థితి నుండి యే స్థితికి యెదగగలడో తెలుస్తుంది. అన్నిటికన్నా అట్టడుగుది తోడేళ్ళమంద వంటి జంతుదశ. కేవలం ఆహార, నిద్రా, మైధునాలే ప్రధానంగా అత్యంత స్వార్థపూరితమైన జీవితం అది. అధ్యాత్మికత అనేది మచ్చుకకైనా లేని స్థితి అది. అక్కడి నుండి ఒక మెట్టుపైకి అంటే అసుర స్థాయికి యెదుగుతాడు. ఐహిక సుఖాలే సర్వస్వం అని భావిస్తే, ఆశాపాశాలతో బంధింపబడి, త్రిగుణాలకు, అరిషడ్వర్గానికి బానిసగా అయి, తన కోరికలు తీరటమే ప్రధానంగా భావిస్తూ, ధర్మాధర్మ విచక్షణ లేకుండా, అక్రమ మార్గంలో అయినా సరే తన కోరికలు  తీర్చుకునే స్థితి అది. అక్కడి నుండి జీవుడు సామాన్య మానవుడి స్థితికి యెదుగుతాడు. ఆ దశలో యిహపరాలు రెండూ కోరుకుంటూ, పుణ్యకార్యాలు ఆచరిస్తూ, ధార్మిక ప్రవర్తన కలిగి, కోరికలను ధర్మమార్గంలో సాధించుకోవడానికి ప్రయత్నిస్తాడు.

- సశేషం

# అమృతబిన్దూపనిషత్

(శ్రీదండి నిర్మలానంద స్వామి వారి బోధ సంక్షిప్తంగా)

(గత సంచిక తరువాయి) సేకరణ - పరాశర ప్రసాద్

మనస్సు శుద్ధ మవ్వాలి. ప్రవృత్తి రహితం కావాలి. ఏం చేయాలి? మనస్సు నిర్విషయ మవ్వాలి. బ్రహ్మ తత్త్వాన్ని తెలియకుండా చేసేది మనస్సే. బ్రహ్మతత్త్వం వస్తువు కాదు. అది నీవే అయి వున్నావు. మనస్సు నిర్విషయమవ్వాలంటే అలవాటు పడిన భోగాలను వదలిపెట్టగలడా మానవుడు. అలవాటు పడిన వాళ్ళకు రోగాలు కూడా భోగాలే.

మనస్సు నిర్విషయమవ్వాలంటే విషయాదుల దోష ప్రవృత్తిని గ్రహించగలగాలి. మిఠాయి అంగడి వుంది. అన్ని రకాల మిఠాయిలు వున్నాయి. ఘుమఘుమ వాసనలు నోరు వూరిస్తాయి. కాని మిఠాయి అంగడివాడు ఏమి తినటానికి లేకుండా వాడికి షుగర్ జబ్బు. వాడు తినడు. అలాగే విషయాదుల దోష ప్రవృత్తి గ్రహించగలిగినప్పుడే వాటిని త్యజించగలుగుతాడు.

భోగాల్ని అనుభవించేది శరీరం. ఈ శరీరం యెప్పుడు రాలి పోతుందో తెలియదు. నచికేతుడు చిన్నపిల్లవాడు. ఆత్మతత్త్వాన్ని బోధించ మని అర్థించాడు యమధర్మరాజుని. యమధర్మరాజు ఆ బాలునికి కోరుకున్నంత ఆయుర్దాయం, యవ్వనం ప్రసాదిస్తాను అన్నాడు. కాని ఆ బాలుడు తిరస్కరించాడు.

ఈ శరీరం అశాశ్వతమైనది, యెప్పటికైనా రాలిపోయేదే. తామరాకు మీద పడ్డ నీటి బిందువు యే క్షణంలో రాలిపోతుందో యెవరు చెప్పగలరు? ఎంతటివారైనా యీ దేహాన్ని వదిలిపెట్టక తప్పదు. వెళ్ళిపోయేవాళ్ళు కనీసం యింత మట్టిగడ్డనైనా తమ వెంట తీసుకు వెళ్ళగలుగుతారా? అసంభవం. అలా తీసుకువెళ్తే యీ రోజు మనం వుండటానికి భూమి మిగిలేది కాదు. అది గ్రహించండి.

అల్పమైనది మానవ జీవితం. భోగాలు నీలోని తేజస్సుని హరిస్తాయి. ముక్తిని పొందాలంటే మనస్సు నిర్విషయమవ్వాలి. దేహానికి

ముక్తి లేదు. ఆత్మకి ముక్తి అవసరం లేదు. మరి ముక్తి దేనికి? ముక్తి మనస్సుకి. మోక్షాపేక్ష వున్నవాడు మనస్సు నిర్విషయమవటమేకాక, మనస్సుని హృదయంలో నిలపాలి. అంతఃకరణలో భావం నశించనంత వరకూ ధ్యానం చేయాలి.

ధ్యానంలో చాలామంది మనస్సుని శ్వాసమీదనో, తేజస్సు మీదనో లేక ఒక రూపం మీదనో నిలిపి చేస్తారు. అది ధ్యానం అనిపించుకోదు. ధ్యానంలో మనస్సు భావనమీద నిలపాలి. అంతఃకరణలో భావం నశించే వరకు ధ్యానం చేయాలి. అంతఃకరణ శుద్ధి చెందాలి. మనస్సులో దోషాలు పోవాలి. మనస్సులో దోషాలు మూడు రకాలు, 1.మలదోషం, 2. విక్షేప దోషం, 3. ఆవరణదోషం.

- సశేషం

# హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

నవంబర్ 2015

6 శుక్ర - శ్రీగురుదశమి - సాయంత్రం 5-30ని॥లకు శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, మహాప్రసాదం.

11 బుధ దీపావళి - ఉదయం 11గం.లకు శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, మహాప్రసాదం.

25 బుధ శ్రీగురుపూర్ణిమ - సాయంత్రం 5-30ని॥లకు శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, మహాప్రసాదం.

డిశంబరు 2015

6 ఆది - శ్రీ గురుదశమి ఉ॥ 11 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగము, మహాప్రసాదం

25 శుక్ర - పూర్ణిమ - క్రిస్మస్ - ఉ॥ 11 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగము, మహాప్రసాదం.

వివరములకు : జగదీశ్వర్ సెల్ - 99856 66797

# శ్రీ మహాభారత నీతి చంద్రిక

## గురుసేవా మహిమ

- శ్రీ రామానుజ దాసు

ఆయోద దౌమ్యుడు అనే పేరు కలిగిన ఒక ఋషి వుండేవారు. వారికి ఆరుణి, వేదుడు, ఉపమన్యుడు అని ముగ్గురు ప్రధాన శిష్యులు వుండేవారు.

ఆ రోజుల్లో గురువుగారి దగ్గర విద్యాభ్యాసం చేసేటప్పుడు శిష్యులు గురుకుల నివాసం చేసేవారు. శిష్యులకు కావలసిన భోజన సదుపాయాలను గురువుగారే చూస్తూ వుండేవారు. శిష్యుల ప్రసాద నిమిత్తం పొలంలో పంటను వేశారు ద్యౌములవారు. ఒకరోజు బాగా వర్షం కురవటంతో పొలానికి నీరు చేరుకుంది. గురువుగారి పొలం పల్లాన వుండటం చేత, మెరకనున్న చెరువుకు గండిపడటం చేత నీటి ప్రవాహానికి పంట మునిగిపోయే ప్రమాదం యేర్పడింది. దానితో మట్టితో గండికి అడ్డువేసే ప్రయత్నం చేశాడు అరుణి. ఎంతకు ప్రవాహం ఆగకపోయేసరికి తానే అడ్డుగా పడుకున్నాడు ఆరుణి.

కొంతసేపటికి ద్యౌములవారు ఆరుణిని వెతుకుతూ బయలుదేరి పొలంవైపు వెళ్ళారు. 'నాయనా! ఆరుణి! ఎక్కడున్నావు?' అని బిగ్గరగా పిలిచారు. ద్యౌములవారి పిలుపుకు ప్రవాహానికి అడ్డుగా వున్న ఆరుణి భారంగా 'గురువుగారూ' అంటూ మూలుగుతూ సమాధానమిచ్చాడు. ఆరుణి మాటను గుర్తించిన గురువుగారు తోటి శిష్యుల సహాయంతో ఆరుణిని బయటకు తీయించారు.

చెరువుకు గండి పడటం వలన పంట మునిగిపోయే ప్రమాదం యేర్పడిందని, దానిని పూడ్చే ప్రయత్నంలో తానే అడ్డుగా పడుకున్నానని చెప్పగానే 'నాయనా! ఆరుణి నీవు యిప్పుడు పొలం గట్టును ఉద్దలించి (పెకలించి) వచ్చావు కనుక ఉద్దాలకుడనే పేరుతో స్థిరపడతావు. గురుసేవలో ప్రాణాలను సైతం లెక్కచేయక నీవు చూపిన యీ గురుభక్తి సదా శిష్యులకు అనుసరణీయం. సమస్తవేదాలు, సకలధర్మాలు, సర్వశాస్త్రాలు నీకు కరతలామలకం అవుతాయి. ఇదే నీ గురుభక్తికి మెచ్చి

నేను యిస్తున్న వరం. అని దౌమ్యులవారు ఆరుణిని ఆశీర్వదించారు.

తరువాత శిష్యుడు వేదుడు. ఆచార్యుని యింటివద్దనే వుంటూ సేవాశుశ్రూషలు చేస్తూ శీతోష్ణ ద్వంద్వాలవల్ల కలిగే బాధను భరిస్తూ సేవ చేసిన మహానీయుడు.

గురువుగారి ధాన్యమును యింటికి చేర్చే ప్రయత్నంలో ఒక దున్నపోతు సహాయంతో బండికి రెండోవైపున తానే మోస్తూ ప్రయాణిస్తున్నాడు. ఒక్కసారిగా బండి బురదగుంటలో కూరుకు పోయింది. దున్నపోతును విప్పి తానే బండిని బురద నుండి బయటకు లాగే ప్రయత్నం చేశాడు. అలా సూర్యుడు పడమరవైపుకు వెళ్ళేవరకు అన్నపానీయాల మీద దృష్టి లేకుండా ప్రయత్నిస్తూనే వున్నాడు.

సాయంత్రం వేళ దాటింది. చిమ్మచీకట్లు ముసురుతున్నాయి. గాఢాంధకారము అలుముకుంది. రాత్రివేళ అయినా శిష్యుడు యింటికి రాకపోవడాన్ని గమనించిన దౌమ్యులవారు శిష్యుని వెదుకుతూ బయలుదేరారు.

ధాన్యపు బండిని ఒక్కడే బయటకు లాగే ప్రయత్నం చేస్తున్న వేదుడిని గురువుగారు వుద్ధరించారు. గురుసేవలో యింతగా శ్రమించిన వేదుడిని చూడగానే దౌమ్యులవారి హృదయం ద్రవించింది. కరుణారస దృక్కులతో శిష్యుడిని సాదరంగా కౌగలించుకున్నారు. సర్వశుభాలు చేకూరుతాయని, సర్వజ్ఞత్వం లభిస్తుందని గురువుగారు అతనికి వరమిచ్చారు.

- సశేషం



# అమెరికా పర్యటనలో శ్రీ మాతాజీ బోధ

(గత సంచిక తరువాయి) - రమణ ప్రసాద్

భక్తులు ఎన్ని కష్టాలు వచ్చినా ఇష్టంగా స్వీకరించి, ఇది భగవంతుని అనుగ్రహమే - అన్న గాఢమైన విశ్వాసం కలిగి వుంటారు. శ్రీగురుదేవులు,"మీరు నేను చేసిన బోధని విచారణలోకి తెచ్చుకోండి. అది వీలు కాకపోతే భక్తుల చరిత్రలు చదవండి" అనేవారు.

ప్రహ్లాద, నారద, పరాశర, పుండరీక,
వ్యాసాంబరీష, శుక శౌనక భీష్మ దాల్భ్యాన్
రుక్మాంగదార్జున - వసిష్ఠ విభీషణాదీన్
పుణ్యానిమాన్ - పరమ భాగవతాన్ స్మరామి ॥

పరమ భాగవతులైన ప్రహ్లాద నారదాదులను నిత్యం స్మరించాలి అని శాస్త్రం చెబుతోంది.

కైలాసంలో సదా శివుడి వద్ద పార్వతీదేవి వద్ద విద్యాధ్యయనం చేసి వారి అనుగ్రహాన్ని పొందాడు వారి పుత్రుడైన కుమారస్వామి. కుమారస్వామి త్రిపురాంతక సంహారం నిమిత్తం దేవతలను ఆ రాక్షసుడి బారి నుండి రక్షించటానికై పుట్టిన కారణ జన్ముడు. ఎంతో భక్తి ప్రపత్తులతో తండ్రి వద్ద తత్త్వాన్ని తెలుసుకుని, దానిని అనుభవంలోకి తెచ్చుకున్న వాడై ఇలా అంటాడు- అచ్యుతోస్మి మహాదేవా తవ కారుణ్య లేశతః । విజ్ఞాన ఘన ఏవాస్మి శివోస్మి కిమతః పరమ్ ॥ -" మహాదేవా! నీ కృపాలేశంచేత నేను శాశ్వతుడను, విజ్ఞాన ఘనుడను, శ్రీమంగళ స్వరూపుడను అని తెలుసుకున్నాను" అంటాడు. దీని సారమే స్కందోపనిషత్తులో వివరింపబడింది. దానిని తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం. ఈ ఉపనిషత్తుకి శాంతి మంత్రం - ఓం సహనావవతు, సహనౌభునక్తు, సహవీర్యం కరవావహై । తేజస్వినావధూతమస్తు మావిద్విషావహై । ఓం శాన్తి శాన్తి శ్శాన్తిః ॥

ఓం సహనావవతు - ఈ ఉపనిషత్తును అధ్యయనం చేస్తున్న గురు శిష్యులమిరువురమూ రక్షింపబడుదుము గాక! ఓం - అంటే ప్రణవం .ఇది సృష్టికి మూలం. ఖాళీగా ఉన్న దానిలో ఏ శబ్దము వినిపిస్తుందో

అది ఓంకార శబ్దము. శంఖంలో చెవి పెట్టి వినండి. ఓం అని శబ్దం వస్తుంది. ఏదీ లేని ఒక అవకాశం నించి వచ్చే శబ్దమే ఓంకారము. తబలా, మృదంగం, డోలక్ మొదలైన వాద్యాలలో మధ్య ఖాళీ ఉండబట్టే నాదం వస్తోంది.

మనలో నాదం ఎప్పుడు వస్తుంది? మనస్సు ప్రశాంతతగా వున్నప్పుడు. హృదయంలో ఏ కదలికలు లేనప్పుడు. అప్పుడు ఒక మంచి మాట వస్తుంది. ఒక మంచి పాట వస్తుంది. ఈ ప్రణవం అ, వు, మ అనే మూడు అక్షరాల సంపుటి. అకారం బ్రహ్మ; ఉకారం విష్ణువు; మకారం మహేశ్వరుడు. బ్రహ్మ సృష్టి చేస్తాడు. విష్ణువు పోషిస్తాడు, శివుడు లయం చేస్తాడు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు మూలమైనవాడు సాక్షాత్ పరబ్రహ్మ. ఆయనే గురుదేవులు. శ్రీ శంకరాచార్యులవారు, శ్రీ రామకృష్ణ పరమహంస, షిరిడీ సాయిబాబా, రామతీర్థ మొదలైనవారు. "భారత దేశంలోభగవద్గీతలో ఎన్ని అక్షరాలు ఉన్నాయో అంతమంది మహాత్ములు ఉండటం వల్లనే మన భారత దేశం ప్రకాశిస్తోంది" అనేవారు శ్రీగురుదేవులు.

ఓంకారంతోనే అన్ని మంత్రాలు మొదలవుతాయి. ఓం నమః శివాయ; ఓం నమో నారాయణాయ మొదలైన మంత్రాలు. ఓంకారం లేని మంత్రం శిరస్సు లేని మొండెం వంటిది.

సహనౌభునక్తు - మేమిరువురము ఈ అధ్యయనము వలన కలిగిన ఫలితమును అనుభవింతుము గాక!

సహవీర్యం కరవావహై - ఈ అధ్యయనమును మేమిరువురము సమర్థవంతముగా పూర్తి చేసెదము గాక!

తేజస్వినావధీతమస్తు - ఈ అధ్యయనము వలన మేమిరువురము తేజోవంతులమవుదుము గాక!

మావిద్విషావహై - మా ఇరువురి మధ్య భేద భావము ఎన్నడూ కలుగకుండు గాక!

ఓం శాన్తి శాన్తి శ్శాన్తిః - ఆధ్యాత్మిక, ఆది భౌతిక, అధిదైవిక తాపములు శాంతించు గాక!

- సశేషం

# సత్సంగామృతం

(గత సంచిక తరువాయి)

- మురళీ

ఆది మధ్యాంత రహితమైనది జ్ఞానము. క్షణ భంగురమైన యీ దేహం నాలుగురోజుల ముచ్చట కోసం భగవంతుని ప్రార్థించటం మానివేసి, మరుగునపెట్టి, మరచిపోతున్నాము. కష్టం వచ్చినప్పుడు పొరపాటు చేశానని లెంపలు వేసుకుంటున్నాము. గురుదేవులకు ఏమి కావాలి? పవిత్రమైన అంతఃకరణ కావాలి. కొందరు లెక్కలు వేస్తారు భగవద్గీత ఎప్పుడు పుట్టింది, మహాభారత యుద్ధం ఎప్పుడు జరిగింది, యివన్నీ మనకు అవసరమా? సమయం వృథా తప్ప. ఆ ఆలోచనలు దేనికి? అసహనం ఓర్వలేనితనం, కామక్రోధాది గుణాలు మనలోనే వుండి ఎప్పుడు మనమీద పడతాయో అని జాగ్రత్త పడకపోతే మిగిలేది భారతయుద్ధమే.



ఒక చాకలి చెరువులో బట్టలు వుతుక్కుంటున్నాడు. మంచి ఆచార వ్యవహారం కలిగిన ఒక బ్రాహ్మణుడు అక్కడకు వచ్చి యింకొక రేవులో స్నానం చేస్తున్నాడు. రజకుడు బట్టలు వుతుకుతుంటే నీళ్ళ చినుకు వెళ్ళి ఆ బ్రాహ్మణుడి మీద పడింది. వెంటనే ఆయన విపరీతమైన కోపంతో గబగబా వచ్చి 'ఏమిరా! నన్ను చూడలేదా? ఆవలి రేవులో స్నానం చేస్తున్నాని నీకు తెలియదా?' అని ఆ రజకుని నాలుగు దెబ్బలువేసి మరీ తిట్టాడు.

ఆ రజకుడు పంతులుగారు పెద్దాయన, గొప్పాయన, విద్వాంసుడు శాస్త్రం చదివినాయన అనుకుంటూ 'తప్పు జరిగింది క్షమించండి' అని యెంత మొరపెట్టుకున్నా వినిపించుకోకుండా

వాడిని చావబాది మరల రేవులోకి వెళ్ళి స్నానం చేస్తూ రజకునివైపు చూశాడు. రజకుడు కూడా బట్టలు ఉతకటం మానేసి స్నానం చేస్తున్నాడు. నేనంటే వాడిని ముట్టుకుని మైలపడ్డాను కాబట్టి స్నానం చేస్తున్నాను. మరి వాడెందుకు స్నానం చేస్తున్నాడు? అనుకుంటూ వచ్చి ఆ రజకుని అడిగాడు. ఆ రజకుడు 'అయ్యా! మీరు చాలా కోపంతో వచ్చి నన్ను ముట్టుకున్నారు కదా! ఆ కోపం నాకెక్కడ అంటుంకుంటుందో అని నేను స్నానం చేస్తున్నాను' అన్నాడు. అప్పుడు ఆ పండితుడికి కనువిప్పు కలిగింది.

'నేనెంతో చదువుకున్నాను, పాండిత్యం గడించాను. ఆ రజకుడు దండాలయ్యా! క్షమించడయ్యా! అని ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోలేదు కోపం పూనాను. నేను ముట్టుకోవటం వలన నా మైలు అతనికి అంటుకుంది' అని పశ్చాత్తాప పడ్డాడు.

మన జీవితం గురించి మనం ఆలోచించుకుందాం. మన మనస్సులోకి అటువంటి పనికిరాని భావనలు ఎన్ని వస్తున్నాయో! అంతఃకరణ పవిత్రంగా వుంటోందా, అపవిత్రత చెందుతోందా? ఎవరైనా అంతఃకరణకు పూస్తున్నారా! మనంతట మనవే పూసుకుంటున్నామా? ఒక్కసారి ఎవరికి వారు ఆలోచించు కోవాలి. మనస్సు ఎందులో 'ఊరవేస్తే యే భావనతో వుంటే, యే సహవాసముతో వుంటే అదే అవుతుంది.

పిల్లవాడు యేడ్చి, యేడ్చి ముక్కువెంట కళ్ళవెంట నీరు కారుస్తూ అమ్మా అని కేకపెడితే తల్లి వున్నది వున్నట్లుగా రాదూ? పనులన్నీ పూర్తి చేసుకుని వస్తుందా? పిల్లల యొక్క ఆర్తిని, ఆవేదనని తల్లి యెప్పటికప్పుడు వారి భావనల ద్వారా తెలుసుకుంటుంది. సాధరణ మానవుల ప్రేమలే యిలా వుంటే, మనల్ని సృష్టించిన ప్రభువు, సర్వాంతర్యామి, జగన్మాత, జగన్నాధుడైనటువ వంటి ప్రభువు, గురునాధుడు మనం ప్రభూ అని ఆర్తితో పిలిచేసరికి మన ముందు ప్రత్యక్షం అవటం లేదా? మనం నోరారా పిలుచుకుంటే ప్రభువు దర్శనం అవదా?

- సశేషం

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

## కోటిపల్లి మామ్మగారు

పోతునూరు అక్కయ్యగారు శ్రీబాబు చెప్పినట్లు కోటిపల్లిలో అన్ని దీక్షలూ శ్రద్ధగా పూర్తి చేశారు. పుట్ట దీక్ష సమయంలో ఒకసారి నిజంగానే కట్టె పుల్లల మధ్య ఉన్న పామును పట్టుకున్నారు. కాని వదిలి పెట్టగానే , ఆ పాము ఏ అపకారము చేయకుండా వెళ్ళి పోయింది. పోతునూరి అక్కయ్యగారి మాంగల్యము సురక్షితంగా నిలిచిపోయింది. ఇలా యెన్నో అద్భుత సంఘటనల ద్వారా వారు శ్రీ బాబు పరమానుగ్రహాన్ని పుష్కలంగా అనుభవించారు.



కోటిపల్లివారింట్లో ఒక భూతం ఉండేది. దాని మూలంగా పాలలోను, పెరుగులోను మాంసం ముక్కలు పడుతుండేవి. చాలా దుర్వాసనగా ఉండేది. కాకినాడలో ఉండే పేరుగల భూతవైద్యులు రోళ్ళ సీతారామ స్వామి నాయుడుగారు ప్రయత్నించారు కాని పని జరగలేదు. శ్రీ బాబు మంత్రించి ఇచ్చిన సాంబ్రాణి రోజూ పొగ వేసిన తరువాత ఆ బాధ నివారణ అయింది.

శ్రీ బాబు తరువాత తరచుగా కోటిపల్లికి భక్తులతో సహా వస్తూ ఉండేవారు. ఒకసారి సరిగా భోజన సమయానికి చాల మంది భక్తులతో వచ్చి శ్రీ బాబు, "అందరూ ఆకలితో ఉన్నారు. వెంటనే అందరికి వడ్డించ"మన్నారు. ఉన్న పదార్థం అందరికీ చాలదనుకొని మామ్మగారు, వాళ్ళమ్మాయి గబగబా వంట ప్రయత్నం మొదలు పెట్టారు. ఎంతసేపటికీ ఎసరు కాగలేదు. ఈ లోపల యింట్లో ఉన్న చిన్న పిల్లల సహాయంతో భక్తులు, యింట్లో వండి ఉన్న పదార్థాన్ని అందరికి వడ్డించారు. అందరూ తృప్తిగా భోజనం చేసి లేచారు. మామ్మగారు ఆశ్చర్యపడుతూ "ఇంట్లో నలుగురి కోసం చేసిన వంట అందరికి చాలదని భయపడి, ఎసరు పెట్టాం బాబూ! అదేమిటో, ఆ ఎసరు ఎంతసేపటికీ కాగలేదు. అది

యింకా కాగుతూనే ఉంది, మీ భోజనాలు అయిపోయాయి. మా వల్ల ఏదో తప్పు జరిగింది బాబూ!" అన్నారు. శ్రీ బాబు నేను రాగానే, మిమ్మల్ని 'వడ్డించండి' అన్నాను గాని 'వంట మొదలు పెట్టండి' అని చెప్పలేదే? గురువు చెప్పినట్లు చేయకుండా వంట మొదలు పెట్టటం తప్పే కదా! మరి ఎసరు కాగమంటే ఎలా కాగుతుంది? ఇక నలుగురికోసం వండింది యిరవై మందికి ఎలా సరిపోతుందంటారా? అది జగన్మాత కృప . ఇక నుంచి గురుదేవుడు చెప్పింది వెంటనే ఆచరించటం నేర్చుకోండి. ఆ ఎసరు దింపేసి, వెళ్ళి భోజనం చేయండి. ఇంకా మీకోసం కూడా మిగిలి ఉన్నాయి" అన్నారు.

పోతునూరు అక్కయ్యకు అత్తవారింట్లో కాపురం కత్తి మీద సాము వలె ఉండేది. శ్రీ బాబు అక్కడ ఎలా మసులుకోవాలో ఆమెకు వివరంగా చెప్పి, "ఏదైనా మనస్సుకు కష్టం కలిగితే నన్ను తలుచుకో" అని చెప్పారు. పోతునూరు అక్కయ్యను బాబు "సక్కుబాయి" అని పిలిచేవారు. ఆమె మామగారు శ్రీబాబు అంటే చాలా ప్రేమగా ఉండే వారు. అప్పట్లో శ్రీ బాబును కోమటి సాధువుగారని, కుర్ర సాధువని అనే వారు. కాని మహాత్ములనే విశ్వాసంతోనే ఉండే వారు.

ఒకసారి పోతునూరు అక్కయ్యగారి పెద్ద తమ్ముడు సీతారామాంజనేయ శర్మకు తీవ్రంగా జ్వరం వచ్చి, సంధి పుట్టింది. సంధిలోనే చనిపోయాడు. ఆయనను బయట వీధిలో పడుకో బెట్టారు. మర్నాటి ఉదయం తీసుకు పోవటానికి సిద్ధమవుతుంటే, ఆయన నిద్రలో నుంచి మేలుకొన్నట్లు లేచి కూర్చుని "శ్రీ బాబు వచ్చారా?" అని అడిగాడు. అందరూ ఆశ్చర్యపడుతుంటే "శ్రీ బాబు నన్ను ఎన్నో యాత్రలకు తీసుకొని వెళ్ళి ఎన్నెన్నో విశేషాలు చూపించారు. ఆ తరువాత "నువ్వు యింటికి పద. నేనూ నీ వెనకే వస్తా"నని నన్ను పంపారు" అన్నారు. అలా ఆయనకు పునర్జన్మను ప్రసాదించిన శ్రీ బాబు కేవలం పరమాత్ముడే అని అక్కడి వారందరూ ఆనందం పొందారు. ఆ తరువాత శ్రీ బాబుతో "ఇలా జరిగింది బాబూ!" అని చెబితే, "అహా అలాగా!" అని నవ్వి ఊరుకున్నారు.

- సశేషం

# విష్ణు  కథలు

- రమణ ప్రసాద్

## కబీర్‌దాస్

ఆ నగరంలో ఒక శ్రీమంతుడైన వర్తకునికి పూర్వజన్మ కర్మఫలం వల్ల కుష్టురోగం సంప్రాప్తించింది. ఎన్ని మందులు సేవించినా, ఎన్ని దానాలు చేసినా రోగం తగ్గలేదు సరికదా నానాటికి అధికమవుతూ వచ్చింది. ఎవ్వరూ ఆయన సమీపానికి వెళ్ళటానికి సాహసించడం లేదు. జీవించటం దుర్భరంగా వుంది కనుక నన్ను గంగలో పారవేయండి అన్నారు. ఆయన ఇంటిలో వారు ఆయన చేతులు కాళ్ళు కట్టి గంగలో పారవేయటానికి సిద్ధమయ్యారు.




ఆ సమయంలో పద్మనాభుడు గంగ స్నానానికి పోతూ అటుగా వచ్చాడు. జరుగుతున్నది అంతా చూసి ఆ వైశ్యునితో "అయ్యా ఇటువంటి సాహసాన్ని ఎందుకు చేస్తున్నావు? మానవ జన్మ అత్యంత దుర్లభమైనదని ఎరుగవా? అన్నిటి కన్నా సర్వోత్కృష్టమైన ఆత్మానుభూతిని ఈ జన్మలోనే పొందాలి కదా!శరీరం త్యాగం చేయటానికి సిద్ధపడకు" అని మృతసంజీవని అయిన శ్రీరామనామమును త్రికరణ శుద్ధిగా మూడు సార్లు ఉచ్ఛరిస్తే నీ వ్యాధి క్షణంలో మటుమాయమై నీకు ఆత్మానుభూతి కలుగుతుంది అని ఆయన చేత ఆయన చుట్టూ ఉన్నవారి చేత శ్రీరామ! రామ! రామ! అని మూడు సార్లు పలికించారు. దానితో ఆందరూ ఆశ్చర్యపడేటట్లుగా అతని వ్యాధి నిశ్శేషంగా తొలగి పోయింది. అతడు రామనామం చేయటం మొదలుపెట్టాడు.

ఇదంతా కబీర్‌దాస్‌కి తెలిసింది. ఆయన పద్మనాభుని పిలిచి "శ్రీరామ నామమును అల్పప్రయోజనానికి మూడుసార్లు వుచ్చరించాలా? త్రికరణశుద్ధిగా ఒక్కసారి "రామా" అని అంటేనే అనంత కోటి జన్మల

పాపాలు పోతాయి కదా!" అన్నాడు. పద్మనాభుడు, "గురుదేవా! ఆ వర్తకుడు జ్ఞానానుష్ఠానపూర్ణుడగు తమరి పాద పద్మములను ఆశ్రయించని కొరత చేత ఒకసారి; శారీరక రోగంతో పాటు భవరోగం నశించి ముక్తి నొందటానికి రెండవసారి; అచ్చట కూడిన జనులందరూ జ్ఞానసంపన్నులై మోక్షార్హులగుటకు మూడవసారి; ఇలా మూడు సార్లు తారక మంత్రాన్ని వారి చేత ఉచ్చరింపచేశాను" అని విన్నవించుకొన్నాడు. కబీర్ సంతోషించి "నీవు నా సచ్ఛిష్యుడవు" అని అతని బుద్ధి కుశలతను మెచ్చుకున్నాడు.

కబీర్ నిరాడంబరమైన జీవితం గడిపాడు. కబీర్ తన ముప్ఫై ఐదవ ఏట నుండి ఎన్నో యాత్రా స్థలాలు దర్శించాడు. గుజరాత్ రాష్ట్రానికి ఎన్నోసార్లు వెళ్ళాడు. అక్కడ రాజకుమారుడైన చతుర్ సింహుడికి నామాన్ని ఉపదేశించాడు. అతడు "జ్ఞానజా" అనే నామంతో ప్రసిద్ధుడైనాడు.

కబీర్ దర్మదాస్ అనే వ్యాపారిని సన్మార్గంలో పెట్టడానికి ఒక వినూతనమైన విధానం అవలంబించాడు. ధర్మదాసు అతని పత్ని గంగానది ఒడ్డున పూజలు చేస్తుండగా కబీర్ ఆ విగ్రహం వైపు చూసి ధర్మదాస్‌ని "నీ దగ్గర ఉన్న పెద్ద విగ్రహం శేరురాయా? ఈ చిన్న విగ్రహం పావుశేరురాయా?అని ప్రశ్నించాడు.

తన పూజా విగ్రహాలను నిరసించిన కబీర్‌పై ధర్మదాసుకు కోపం వచ్చింది. అంతటితో ఆగక కబీరు,, "ఈ విగ్రహాలు నీతో మాట్లాడతాయా? నీవు చేసే పూజలు స్వీకరిస్తాయా?" అని అడిగాడు. ధర్మదాసు బదులు చెప్పే లోపల వెళ్ళిపోయాడు. కబీర్ మాటలు ధర్మదాసుని ఆలోచనలలో పడేసింది. నిజమే! ఈ విగ్రహాలు తాము చేసిన పూజలను అంగీకరిస్తునట్లుగా ఏమీ బదులు చెప్పలేదు.

- సశేషం

---

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL